క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశం

భీమడోలు: నిడమర్రు మండలం భువనపల్లిలో ఈ నెల 2వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీ నివాస్, ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 4వ తేదీ బుధవారం వెన్నుపోటు దినం నిర్వహించనున్న నేపథ్యంలో ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు క్యాంపు కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నారన్నారు. ఉంగుటూరు, గణపవరం మండలాల నాయకులు ఈ సమావేశానికి హాజరవుతారని తెలిపారు. కూటమి సర్కారుపై ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు దగ్గర పడ్డాయని వారు పేర్కొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూలాలంకరణలో రాట్నాలమ్మ

పెదవేగి: భక్తుల పాలిట కల్పతరువుగా ప్రసిద్ధి గాంచిన శ్రీ రాట్నాలమ్మ దేవస్థానానికి విచ్చేసిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదవేగి మండలం రాట్నాల కుంట గ్రామంలో వెలసిన శ్రీరాట్నాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రీతికరమైన రోజుకావడంతో దేవస్థానానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. ఈ వారం అమ్మవారికి రూ.95,212 ఆదాయం లభించిందని దేవస్థాన కార్య నిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ చెప్పారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

భీమడోలు: వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. భీమడోలులో ఆదివారం రేషన్ షాపుల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, రాష్ట్ర అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, పౌరసరఫరాల విభాగం జిల్లా మేనేజర్ పి.శివరామ్మూర్తి, తహసీల్దార్ బి.రమాదేవి, మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల ప్రారంభం

ఉంగుటూరు: మండలంలోని చేబ్రోలులో రేషన్ షాపులు పున:ప్రారంభ కార్యక్రమం ఎమ్మెల్యే ధర్మరాజు ప్రారంభించారు. ఎక్కడైనా రేషన్ ఇవ్వకపోయినా, ఇబ్బందులు ఉన్నా 1967,1123 టోల్ ఫ్రీకి ఫోన్ చేయాలని ఆయన తెలిపారు.

ప్రమాద స్థలాలను పరిశీలించిన డీఎస్పీ


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్

దెందులూరు: జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే స్థలాలను ఆదివారం నూజివీడు డీఎస్పీ ప్రసాద్ పరిశీలించారు. శుక్రవారం అర్ధ రాత్రి జాతీయ రహదారిపై నాగ హనుమాన్ ఫ్యాక్టరీ సమీపంలో జరిగిన బస్సు బోల్తా ప్రమాద వివరాలను దెందులూరు ఎస్సై ఆర్.శివాజీని అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారి పక్కన ఉన్న దాబాలు, బంకులు ఇతర ప్రదేశాల్లో వాహనాలు ఎట్టి పరిస్థితుల్లో నిలుపుదల చేయకుండా నిరంతర పర్యవేక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాల నివారణకు శాఖపరమైన సూచనలను చేశారు.

అదనపు వాటర్ ట్యాంక్ అవసరం

దెందులూరు: మేజర్ పంచాయతీ అయిన కొవ్వలి గ్రామంలో దాదాపు జనాభా 15000 మందికి చేరింది. గ్రామంలో నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయని, పెరుగుతున్న జనాభాకు ఇవి సరిపోవడం లేదని కొవ్వలి గ్రామంలో మరో నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టిట్టాలని ప్రజా ప్రతినిధులు, అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

రమణను ఆదర్శంగా తీసుకోవాలి

పెదపాడు: ఉపాధ్యాయుడిగా మండల విద్యాశాఖాధికారిగా రమణ అందించిన సేవలను ఆదర్శంగా తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి డీవీ రమణను ఆదర్శంగా తీసుకోవాలని పెదపాడు ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు, బొర్రా గోపీ మూర్తి, పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరులో గ్రాండ్‌కృష్ణ హాల్‌లో పదవీ విరమణ సభ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెదపాడు ఎంఈఓ1 సబ్బితి నర్సింహమూర్తి, మారుబోయిన కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాలొన్నారు.

నిర్వహణ లోపం.. రహదారికి శాపం


గణపవరం ఇందిరమ్మ కాలనీ వద్ద ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్


బావాయిపాలెం రోడ్డులో చాణక్య జూనియర్ కళాశాల వద్ద గుంతలు

- గత ప్రభుత్వంలో రూ.3 కోట్లతో నిర్మించి, నిర్వహణ
- కూటమి అధికారంలోకి వచ్చాక నిర్వహణపై నిర్లక్ష్యం
- ఇదీ గణపవరం–క్రొవ్విడి రహదారి దుస్థితి

నిడమర్రు: గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన బావాయిపాలెం ఆర్అండ్‌బీ రోడ్డు నిర్వహణ లోపంతో అడుగడుగునా ప్రమాదకరంగా తయారైంది. 2023 ముందు దశాబ్ద కాలంగా అధ్వానంగా ఉన్న ఈ రహదారిని నాటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కృషితో నూతన రహదారి నిర్మించి, నిర్వహణ చేశారు. అనంతరం ప్రభుత్వం మారింది కానీ ఈ రహదారి వెంబడి కనీస నిర్వహణ మరమ్మతులు చేయకపోవడంతో ఈ రహదారి వెంబడి మార్జిన్లు కుంగిపోయి ప్రమాదకరంగా తయారైంది. దీంతో వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించడం ప్రాణ సంకటంగా మారింది. ముఖ్యంగా రోడ్డు మార్జిన్‌లు కుంగిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఎదురెదురు వాహనాలు తప్పించుకోవడంలో ప్రాణాల మీదకు తెచుకుంటున్నారు. చాణక్య కాలేజీ, ఇందిరమ్మ కాలనీ, పుంతలోముసలమ్మ గుడి, చైతన్య స్కూల్ వంటి ప్రాంతాల్లో రోడ్డు మరీ దారుణంగా ఉందని వాహనదారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రహదారి కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో రోజు రోజుకూ అధ్వానంగా మారుతున్నట్లు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

భారీ వాహనాలతో రద్దీ

ఈ రహదారి ఆకివీడు వెళ్లేందుకు దగ్గరి మార్గం కావడంతో గణపవరం మీదుగా ఆకివీడు, కైకలూరు వెళ్లే భారీ వాహనాలు ఈ రహదారి వెంబడే వెళుతుంటాయి. గణపవరం నుంచి ఉండి మీదుగా ఆకివీడు వెళ్లాలంటే మరో 7 కిలోమీటర్ల వరకూ దూరం పెరుగుతుంది. దీంతో ఈ రహదారిపై ట్రాఫిక్ సమస్య కూడా ఉంది. ఈ రహదారి వెంబడే కళాశాలలు, ప్రైవేట్ విద్యా సంస్థలు ఉండటంతో ఉదయం సాయంత్రం వేళల్లో స్కూల్ బస్సులతో రద్దీగా ఉంటుంది. అసలే ట్రాఫిక్ సమస్య దీనికి తోడు రోడ్డు గోతులు, గుంతలతో ఉండటంతో ప్రయాణికులు ఈ మార్గంలో వెళ్లాలంటే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.3 కోట్లతో రోడ్డు నిర్మాణం

వైఎస్సార్‌సీపీ హయాంలో 2023లో గణపవరం మహాలక్ష్మి కూడలి నుంచి క్రొవ్విడి వరకూ ఈ ఆర్అండ్‌బీ రహదారిని రూ.3 కోట్ల నిధులతో నిర్మించారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ రహదారి నిర్వహణపై పాలకులు ఎటువంటి శ్రద్ధ పెట్టకపోవడంతో ఈ రోడ్డు రోజు రోజుకూ అధ్వానంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణం రహదారి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డ్ సందర్శన


డంపింగ్ యార్డును సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి

ఉంగుటూరు: మండలంలోని చేబ్రోలు గ్రామంలో రేషన్ షాపు పునః ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఉంగుటూరు ఎమ్మెల్యే పి.ధర్మరాజు, జేసీ పి.ధాత్రిరెడ్డి చేబ్రోలులో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ చేబ్రోలు గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. ఎమ్మెల్యే ధర్మరాజు, సర్పంచ్ సునీత, తహసీల్దార్, డిప్యూటీ ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వ్యవసాయ విద్యుత్‌లో మార్పులు

భీమడోలు: స్థానిక సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల్లోని అగ్రికల్చర్ కనెక్షన్ల లోడ్లను రెండు గ్రూపులుగా విభజించి విద్యుత్ సరఫరా చేస్తామని ఆ శాఖ ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. భీమడోలులో ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఏ గ్రూపులో తెల్లవారు జాము నాలుగు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, బీ గ్రూపుకు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

పొగాకు మత్తులో యువత చిత్తు

- ఆరోగ్యాన్ని పీల్చేస్తున్న పొగాకు
- పొగాకు వాడకం నివారణపై విస్తృత ప్రచారం
- దంత కళాశాలలో ప్రపంచ పొగాకు వ్యతిరేక మాసోత్సవం



పొగాకు వలన కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తున్న దంత వైద్య బృందం

పెదవేగి: యువత ఆరోగ్యాన్ని నశింపజేసే మాయాజాలం పొగాకు. పొగాకులోని నికోటిన్ వలన వ్యసనాలకు బానిసలైన యువత చిత్తవుతున్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని దుగ్గిరాల సెయింట్ జోసఫ్ దంత కళాశాల విద్యార్థులు గత నెల రోజులుగా పొగాకు వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు వలన ఎటువంటి ఇబ్బందులు ఎదురవుతాయి. ఎటువంటి సమస్యలను ప్రజలు తెచ్చుకుంటున్నారనే విషయాలపై అవగాహన కల్పించారు. ఆదాయం కోసం ప్రభుత్వాలు ఆరాట పడకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే పొగాకును నిషేధించాలని విద్యార్థులు అన్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కారణమయ్యే పొగాకు ఉత్పత్తులపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 80 లక్షల మంది పొగాకు వాడకంతో మృతి చెందుతున్నారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం సుమారు 13 లక్షలమంది పొగాకు కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. యువతలో పొగాకు వాడకం బాగా పెరుగుతుంది. ఈ చెడు వ్యసనానికి యువత దూరంగా ఉండాలి.

– డాక్టర్ ఎం.పావన సంధ్య, ప్రొఫెసర్, హెచ్‌ఓడీ, ప్రజా ఆరోగ్య దంత వైద్య విభాగం

పొగాకు నివారణతో ఆరోగ్యం



మీ శ్వాసను పొగతో కాక ఆశతో నింపుకోండి. చాలా మందికి పొగ తాగడం మొదట్లో అలవాటు వలే కనిపించినా, ఇది క్రమంగా వ్యసనంగా మారుతుంది. అనంతరం ప్రాణాంతకం అవుతుంది. యువత ఈ వ్యసనం నుంచి బయట పడాలి.

– డాక్టర్ ప్రశాంత్ తుమరాడ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రజారోగ్య దంత వైద్య విభాగం

ప్రభుత్వం చొరవ చూపాలి



ప్రభుత్వం పొగాగుపై నియంత్రణను తీసుకు రావాలి. యువత చెడు మార్గాలకు ఆకర్షితులు కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రభుత్వం మరింత చొరవ తీసుకొని పొగాకును నియంత్రించే బాధ్యతను చేపట్టాలి.

– డాక్టర్ కె.విష్ణుప్రియ ఇంటర్న్ విద్యార్థి

నేతలను స్మరించుకోవడమే నిజమైన నివాళి


భీమడోలు: మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమడోలు: జాతీయ నాయకులను స్మరించుకోవడమే నిజమైన నివాళి అని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఉల్లాసభరిత వాతావరణంలో నిర్వహించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేశారు. అనంతరం మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎన్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఆటల పోటీలు

దెందులూరు: పోతునూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం క్యారం బోర్డు చెస్ విభాగాల్లో పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. గ్రంథ పాలకులు రాంబాబు పాఠశాల విద్యార్థులకు జూనియర్ సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు శిక్షణ తరగతులు ముగిసిన తరువాత బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.


దెందులూరు: క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

నేడు కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం స్థానిక హైస్కూల్ వద్ద వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ 31వ వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ భక్త బృందం తెలిపింది. వార్షికోత్సవంలో భాగంగా సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయంలో చండీహోమం నిర్వహించనున్నట్లు చెప్పారు. జ్యోతిష్య, వాస్తు, ఆగమ సిద్ధాంతి ఈరంకి సుబ్రహ్మణ్య వర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పదవి మరింత బాధ్యతను పెంచింది


మద్దాల నాగయ్యను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ దెందులూరు నియోజకవర్గం ఎస్సీసెల్ అధ్యక్షుడిగా పదవి మరింత బాధ్యత పెంచిందని కవ్వగుంట గ్రామ సర్పంచ్ మద్దాల నాగయ్య అన్నారు. తనకు నియోజవర్గ పదవి రావడానికి కారకులైన మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, పార్టీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు చల్లగుళ్ళ తేజ, మేడికొండ కృష్ణారావు, దెందులూరు నియోజకవర్గ పార్టీ ఎస్సీ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నియోజవర్గ పదవి లభించిన నాగయ్యకు సత్కార సభ నిర్వహించారు.

5న ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కొయ్యలగూడెం: సీతంపేటలోని శ్రీ ఉమా రామలింగేశ్వర శివాలయంలో ఈనెల 5వ తేదీన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలకు సంబంధించి ఆలయంలో యాగశాలను నిర్మించారు. ఉత్సవాలకు సంబంధించి ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. జాతీయ ప్రధాన రహదారి పక్కన గల శివాలయం ప్రాంగణంలో ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రారంభించారు. శివాలయంతో పాటు గ్రామంలోని ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

నేడు పీజీఆర్ఎస్

ఏలూరు(మెట్రో): చింతలపూడి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారన్నారు.

ఆడబిడ్డ వివాహానికి సాయం


వివాహ ఖర్చులకు సంబంధించిన నగదు అందిస్తున్న విశ్వబ్రాహ్మణులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఆడబిడ్డ వివాహానికి విశ్వబ్రాహ్మణులు ఆర్థిక సాయం సాయం అందించారు.ఆదివారం కామాక్షి విశ్వబ్రాహ్మణ సత్రంలో చిట్టూరి సత్యనారాయణ కుటుంబానికి విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు అప్పలభక్తుల శివకేశవరావు (శివ శ్రీ) అందచేశారు. కమ్మరి వృత్తి ద్వారా జీవనం సాగించే చిట్టూరి సత్యనారాయణ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తన రెండవ కుమార్తె వివాహం చేసేందుకు తగిన ఆర్థిక స్థోమత లేక విశ్వబ్రాహ్మణ ఉద్యోగ వ్యాపారస్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శివశ్రీని ఆశ్రయించగా శివ శ్రీ విజ్ఞప్తి మేరకు విశ్వబ్రాహ్మణ సంఘీయులు విరాట్ సేవా ట్రస్ట్, వెస్కోట్రస్ట్, ఏలూరు పట్టణ స్వర్ణకార సంఘం, శ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం, వడ్రంగిపనివారల సంక్షేమ సంఘం సభ్యులు, షుమారు లక్షా ఏభై వేల రూపాయలు ఖర్చుతో వివాహం జరిపించేందుకు ముందుకొచ్చారు. ఆదివారం సంఘీయుల సమక్షంలో కొంత నగదును ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ ఉద్యోగ వ్యాపారస్తుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు లక్కోజు వెంకటేశ్వరరావు (కొండబాబు), ప్రధాన కార్యదర్శి లంకలపల్లి జగదీష్, విరాట్ సేవా ట్రస్ట్ చైర్మన్ కొత్తల శివకుమార్, ట్రస్ట్ సభ్యులు, వడ్రంగి పనివారల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాట్నూరి శివరావు, సంఘం నాయకులు అద్దంకి సత్యన్నారాయణ, కామకోటి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి


5కే వాకథాన్‌లో పాల్గొన్న కలెక్టర్

ఏలూరు (టూటౌన్): మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. ఆదివారం నషాముక్త్ భారత్ అభియాన్, అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అవగాహన కార్యక్రమాల నిర్వహణలో భాగంగా విభిన్న ప్రతిభావంతుల శాఖ, పోలీస్, ఎక్సైజ్, ఈగిల్ టీమ్, వైద్య ఆరోగ్యశాఖ, సంయుక్త ఆధ్వర్యంలో వట్లూరు సీఆర్ఆర్ మహిళా కళాశాల నుండి ఇండోర్ స్టేడియం వరకు నిర్వహించిన 5కె వాక్ థాన్ ను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నియంత్రణ ప్రతిజ్ఞ చేయించారు అనంతరం వాక్ థాన్ కార్యక్రమంలో అత్యంత ప్రతిభ కనబరిచిన 5 మంది పురుషులకు, 5 మంది మహిళలకు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం. ముక్కంటి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య, డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివ రామ్మూర్తి, డీఎస్టీఓ శ్రీనివాసరావు, రామ్ కుమార్, పాల్గొన్నారు.

వీఆర్వో సేవలు అభినందనీయం


వీఆర్వోను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెదపాడు: గ్రామ పరిపాలనాధికారిగా, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆర్ఏఎస్ఆర్ చంద్రమూర్తి(రాంబాబు) సేవలు అభినందనీయమని పలువురు ప్రజా ప్రతినిధులు రెవెన్యూ అధికారులు తెలిపారు. సీఆర్ఆర్ కాలేజీ ఆడిటోరియంలో ఘనంగా సన్మాన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, రైస్ మిల్లర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, తహసీల్దార్లు, ఎ.కృష్ణజ్యోతి, విజయ్‌కుమార్, వీఆర్వోల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

హెచ్‌ఎంల బాధ్యతల స్వీకరణ

దెందులూరు: మండలంలో ఆదివారం రెండు ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంలుగా బాధ్యతలు స్వీకరించారు. మేధినరావుపాలెం ఉన్నత పాఠశాలకు పి.సురేష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. దెందులూరులో నూతన హెచ్‌ఎంగా నియమితులైన వడ్లపట్ల విజయకుమార్ బాధ్యతలు స్వీకరించారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: నారాయణపురం హైస్కూలు హెచ్‌ఎంగా తోట పోతురాజు, ఉంగుటూరు హెచ్‌ఎంగా మద్దా రాజా రవీంద్ర కుమార్, రాచూరు హెచ్‌ఎంగా చిన్ని సురేంద్ర బాధ్యతలు చేపట్టారు. కాగుపాడు హెచ్‌ఎంగా పీవీవీఎం శ్రీనివాసరావు, నీలాద్రిపురం హెచ్‌ఎంగా వి.విజయదుర్గ, ఎ.గోకవరం హెచ్‌ఎంగా చింతమనేని లక్ష్మీ చైతన్య, చిన్నమెల్లమిల్లి హెచ్‌ఎంగా ఎం.శ్రీనివాసరావు, చేబ్రోలు గరల్స్ హైస్కూల్ హెచ్‌ఎంగా కేవీడీ మల్లేశ్వరి ఆదివారం విధుల్లో చేరారు.

కూటమి ప్రభుత్వానికి పతనం ఖాయం

పెదపాడు: ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు పరచడంలో విఫలమైన చంద్రబాబు ప్రభుత్వానికి పతనం తప్పదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కత్తుల రవి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఏడాది కాలంగా ప్రకటించిన సూపర్‌సిక్స్ ఎప్పుడు అమలు చేస్తారా అని ప్రజలు ఎదురు చూస్తుంటే అవి అమలు పరచకపోగా కొత్త మోసాలతో, వింత పోకడలతో, మోసపు మాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఏడాది కాలంలో రూ.1లక్షల 61వేల కోట్లు అప్పులు చేసి మంత్రులు ఎమ్మెల్యేలు నిధులు దోచుకున్నందుకా అంటూ ప్రశ్నించారు.